# మొహబ్బత్

వీరభద్రరావు మామూలు ప్రకారం బజార్‌కి షైర్‌పోయి తిరిగివచ్చి తన ఇంటి మెట్లక్కబోతుండగా వంచుకొన్న తల ఎత్తి చూడాల్సొచ్చింది. చూశాడు! అంతే? కథ మొదలయి వూరుకుంది. అతని కళ్ళముందు బ్రహ్మాండమైన మెరుపు మెరసినట్లయి కళ్లు జిగేలుమని కొట్టుకున్నాయి. గుండెలు గాప్ లేకుండా సెకండ్‌కీ లక్షసి సార్లు హడావుడిగా కొట్టుకోవడం మొదలెట్టినయి. కాళ్ళకింద "భూమి" అనే పదార్థం ఏమీ లేనట్లు ఫీలయ్యాడు. ఇంకా ఇలాంటివెన్నో జరిగాక తన కళ్లు ఒహవేళ తనని సరదాకి ఏడిపిస్తున్నవేమో అనుమానం వచ్చి కళ్ళు నులుముకొని మళ్ళీ చూశాడు.

ఊహు! కళ్ళు చాలా కరెక్ట్‌గా పర్‌ఫెక్ట్‌గా పనిచేస్తున్నాయి.

"మరోవేళ కలేమో" అని చెయ్యి గిల్లుకొన్నాడు చచ్చేనొప్పేసి "కార్" మని అరవబోయి వూరుకొన్నాడు.

రంభా ఊర్వశి, తిలోత్తమా కలిసి కంబైండ్ అందంతో ఈ విధంగా అవతరించారా? తరిస్తే ఆ అందాన్ని వర్ణించడానికి ఏ భాష సరిపోతుంది? అసలు తన కొచ్చిన భాషలేమిటి? "తెలుగు.... ఇంగ్లీషు... హిందీ.."

"దేశభాషలందు తెలుగు లెస్స! కృష్ణదేవరాయలు గట్టిగా అరచినట్లయిందతని చెవిలో. మరి ఇంగ్లీషు... అదేమో విదేశీభాష! అసలే భాషలో వర్ణించాలన్నా ముందు తనొక కవిగాడు అవ్వాలిగదా? వీరభద్రరావుకి తనమీదే చచ్చేంత కోపం వచ్చింది. "తనో కవిగాడుగా ఎందుకు పుట్టలేదు. ఈ ఆలోచన అన్నింటిని చితగ్గొట్టేస్తూ! మరో అనుమానం అతని బుర్రలో మెగ్నీషియం తీగలా వెలిగింది" అసలీ సుందరీమణి ఎవరొక్కో....

"పోనీలే! ఎవరయితేనేం! మనకెందుకని వదిలేద్దామన్నా ఈవిడగారు తనింట్లో వుండటమేమిటి?

ఇంతకూ అసలిది తన.. ఇ...ల్లే...నా?

బేజారు పడిపోయాడతను. డోర్ నంబరు చూశాడు... పదకొండూ, రెండు నూటతొమ్మిదీ ఖచ్చితంగా తన ఇల్లే... అయినా తన పిచ్చిగాపోతే ఎదురుగ్గా తన కుర్చీలూ, టేబులూ, ఫాన్ కనబడుతూనే వుండె?" మరి ఆ పిల్ల నదురూ బెదురూ లేకుండా తన ఇల్లు లాగానే కుర్చీలో కూర్చుని పత్రిక చదువుతోందే! ఇప్పుడు... తనేం మాట్లాడాలి... ఎలా మాట్లాడాలి?

"ఏమండి! అసలెవరండి మీరు, ముసిముసినవ్వుల వారూ?" అనేస్తే...

ఛ.. ఛ – తెలుగు సినిమాలోలా వుంటుంది.

"మరెలా అడగాలి?"

"ఎవరండీ?"కుర్చీలోంచి లేస్తూ ప్రశ్నించిందామె. రెండు వీణలు ఒకేసారి మీటి వదిలేసినట్లుందా గొంతు.

వీరభద్రరావు నిశ్చేష్టుడయిపోయాడు. తనడగాల్సిన ప్రశ్న! మరి తనడుగుతుందేం? ఘోరం! అతనికి ఉక్రోషం వచ్చేసింది.... "నేను.. నే–"

"నేనంటే?" డబాయించేస్తోంది పైగా.

ఈసారి పూర్తి ఖంగారు పడిపోయాడతను. వళ్ళంతా చెమటలు పట్టేసినాయి. సమయానికి ఎక్కడికి పోయాడా అని నౌకరు కుర్రాడి మీద ఓహ్ కోపం వచ్చేసింది. ఆ కోపంలో, లోలోపలే వాణ్ణి ఇష్టం వచ్చినట్లు తిట్టుకొన్నాడు.

"రాస్కెల్, గాడిద, కుక్క, పిల్లి, ఈగ, దోమ–"

"మిమ్మల్నేనండీ? ఎవరి కోసం?"

తడబడిపోయి, గొంతారిపోయి, ఉక్కిరిబిక్కిరయ్యి 'హీ...ఇంటి... యజమాని....' "ఆయన్లేరండీ! బజారుకెళ్ళేరు!"

వీరభద్రం గంటకు కిలో ఆవదం త్రాగేవాడిలా మొహం పెట్టాడు. ఇంతలో అతను చూసిన గజేంద్రమోక్షం సినిమాలో, విష్ణుమూర్తిలా, తన పాలిట ఆపద్బాంధవుడిలా లోపల్నుంచి ఊడి పడ్డాడు కుర్రాడు.

"ఈయనేనండి బాబుగారు!" వీడి వెధవ ముఖం వేసుకొని తనకీ, ఆ సుందరికీ బోడి ఇంట్రడక్షన్. వీరభద్రంకి వాడిని డిస్మిస్ చేసేయాలన్నంత కోపం వచ్చింది.ఆ అమ్మాయి ఒఖ్ఖసారిగా ఓ వందసార్లు పడేంత సిగ్గు పడిపోయింది.

"ఆహా! సిగ్గుపడటంలో కూడా ఇంత అందం వుందా?"

బుద్ధిలేని అనుమానం! వుండే వుంటుంది.

తనూ అనేకసార్లు సిగ్గుపడ్డాడు పడే ఆడాళ్ళని చూశాడు. కాని, ఇంత అందంగా పడ్డాళ్ళని ఇంత వరకయితే ఎక్కడా చూసిన గుర్తులేదు.

"బాబుగారు! మీరటు వెళ్ళారా? .. ఇటు చుట్టాలొచ్చారు.... హి.. హి.." ప్రక్కకు తొలగి దారి ఇచ్చిందామె. వీరభద్రరావు కాళ్ళు లోనికి నడిచినయి.

ఇంతలోనే వంటింట్లోంచి కళ్ళజోడుతో సహా అమ్మమ్మ బయటికొచ్చేసింది వీరభద్రాన్ని చూసి సంబరపడిపోయింది. 'ఒరేయ్! భద్రంగా... చాలా పొడుగెదిగి పోయావురా!...

సూపర్ తింటున్నావేమిటి?.. అయిదేళ్ళయిపొయె నినుచూసి! చిక్కిపోయావ్ కూడానూ! పెళ్ళొద్దని గొడవటగా... అమ్ముత్తరం వ్రాసిందాయె..." ప్రశ్నల తుఫాను.

కాని వీరభద్రరావు ఏ ఒఖ్ఖ ప్రశ్నకీ జవాబిచ్చే స్థితిలో లేడు. తన ప్రశ్నలకి బోలెడు జవాబులు రావాల్సుంది మరి.

"ఈ చిన్నది ఎవరు? ఎప్పుడో, ఎక్కడో చూసినట్లు అనిపిస్తోంది. అటులయిన, ఎప్పుడు? ఎక్కడ?.."

వీరభద్రరావా అమ్మాయివంకే రైఫిల్ గురిపెట్టినట్లు చూడ్డం అమ్మమ్మ కనిపెట్టేసింది.

"అలా చూస్తావేంరా? ఈ చిన్న వయస్లోనే అంత మతి మరపా? .. జయలక్ష్మిరా.. చిన్నప్పుడు ఒకళ్ళని విడిచి ఒహాళ్ళు వుండేవాళ్ళు కాదు.. అయినా పదేళ్ళనాటి సంగతాయె. నీకు మాత్రం ఏం గుర్తుండేడుస్తుంది?...

"జయలక్ష్మి" ఆ పేరుదగ్గరే అతని బుర్ర నిలచి పోయింది.

బోలెడు బావుంది పేరు. చిన్నప్పుడే విడిచి వుండేవాళ్ళు కాదుట. అప్పటి సంగతేమోగాని ఇప్పుడు ఆ అమ్మాయి లేపోతే తను ఠకీమని ఛస్తాడేమో భయంగావుంది. అమ్మమ్మతో మరో నాలుగు మాటలు మాట్లాడి ప్రక్కగదిలోకెళ్ళి చిన్న తనాన్నంతా కెలికి పైకితీసి వెదికి చూశాడు. ఓ చోట మసగ్గా కనిపించింది.

అప్పుడు తనకి పన్నెండేళ్ళుంటయి. ఆ సంవత్సరమే అత్తయ్యనీ, జయలక్ష్మినీ, తీసుకొచ్చి తమ ఇంట్లో వదిలి రెండు రోజుల్లో వస్తానని జెప్పి వెళ్ళిపోయిన మావయ్య మళ్ళీ తిరిగి రాలేదు. ఏమయ్యాడో ఎక్కడికి పోయాడో ఎవ్వరికీ తెలియలేదు. ఆ సంవత్సరమంతా తమ ఇంట్లోనే వుండిపోయారు. ఆ తరువాత అత్తయ్య వాళ్ళన్నగారింటికి వెళ్ళిపోయింది. విజయలక్ష్మితో, అంతే! అక్కడ్నుంచీ, వాళ్ళ సంగతేమి తెలియదు తనకి. ఆ సంవత్సరం తనూ, జయా కలసి, ఆర్.బ్రాంచి స్కూల్లో చదివేరు తను స్కూలు మానేస్తే జయకూడా మానేసేది. తనకంటె నాలుగేళ్ళు చిన్నది జయ. అంచేత అందరూ తమిద్దరినీ జంటగా ఏడిపిస్తూండేవాళ్ళు... అన్నట్లు జయక్కూడా ఈ సంగతులన్నీ గుర్తుంటయ్యా? ఒకవేళ ఉండవేమో! మరి తన వంక అలా చూస్తుందెందుకు? ఆ చూపులు ... స్టీలుప్లాంట్ మీద గవర్నమెంటు ప్రకటనల్లా తన గుండెల్ని పిండేస్తున్నాయి.

"ముసల్దంటే నీకు లేపోయినా, మనవడెలా వున్నాడో అన్న ఆపేక్ష నాకు పోలేదురా! ఎప్పటికప్పుడు నిన్ను జూడాలనుకోడం. అంత దూరం నుంచీ ఒక్కదాన్ని రాలేక ఊరుకోడం... చివరికి ఏమయినా సరే అనిజెప్పి... దీన్ని వెంబడేసుకొనొచ్చా!" విసురుగా మాట్లాడింది అమ్మమ్మ.

నిజమేమరి! ఆమె తనని కొన్నేళ్ళు  తన చేతులమీద పెంచింది. అయినా వెధవది తన జ్ఞాపకశక్తికి కూడా బోలెడు పక్షపాతబుద్ధేడిసింది. లేపోతే, "జయలక్ష్మి" అనేసరికి పదేళ్ళ క్రిందటి సంగతి ఠక్కున గుర్తుకురావడమేమిటి? తనంటే ఇంత ప్రేమున్న అమ్మమ్మ అసలు గుర్తులేక పోవడమేమిటి?

"వంటా.. అదీ ఈ కుర్రాడే చేస్తాటగా! తిండీ తిప్పలూ, సరిగ్గా లేకుండా ఎందుకొచ్చిన తిప్పల్రా? హాయిగా మంచి లగ్గం జూసుకొని ముడెట్టుగొంటే పోలా

నా కస్సలు పెళ్ళొద్దని ఉత్తరం వేశావుటగా అమ్మకీ, నాన్నకీనూ!.. నీ మాటయితే వింటాడే! వాడ్ని ఒప్పించి రమ్మని.... మీ అమ్మ ఒకటే ఇదయిందనుకో..."

"ఏ దమ్మమ్మా! ఇంతకుముందువరకూ నాకు నచ్చిన పిల్లేదొరకలేదాయె!" జయలక్ష్మి వంక ఓరగా చూస్తూ  అన్నాడు వీరభద్రం.

"ఆ మరీ విడ్డూరం లేస్తూ!.... ఇంతోటి హైదరాబాదులో నీకు నచ్చేపిల్లే లేకపోయిందా?..." అంటూ అన్నం వార్చడానికి  వెళ్ళిపోయిందమ్మమ్మ.

ముఖానికి క్రానికల్ పేపరడ్డం పెట్టుకొని దొంగచాటుగా జయలక్ష్మి వంకే చూస్తున్నాడు వీరభద్రం.

నౌకరు కుర్రాడికి  వంటపని లేకపోవడం చేత చాలా హుషారుగా వున్నట్లుంది. వుండుండి "లలిలాలి.. లాలలిలాలి..." అంటూ పాడేస్తున్నాడు.

ఉన్నట్లుండి వీరభద్రానికి  జయలక్ష్మితో మాట్లాడాలని చిన్నకోరిక కలిగింది. అదే నాలుగుసార్లు లోపలనుకొని, అయిదోసారి బయటకనేశాడు. ఎదురుగ్గా  కూచుని పత్రిక చదువుతూన్న జయలక్ష్మి ఉలిక్కిపడింది. ఓ క్షణం అతనివంకే చూసింది. పరిస్థితి విషమించేసిందని గ్రహించేసి కొద్ది ధైర్యం అరువు తెచ్చుకొని ".... నే గుర్తున్నానా జయా" అంటూ ఓ వెధవ నవ్వునవ్వాడు. "ఎలా మర్చిపోతాను బావా!.. నువ్వే  నన్ను మర్చిపోయావు" కంఠం కన్నా తను చిన్నప్పుడు రాజావారి చెఱకు తోటలో దొంగతనంగా తెచ్చుకుతిన్న చెరుగ్గడ కన్నా తియ్యగా వుంది సంబోధన.

"భలేదానివేలే! నాగ్గుర్తు లేకపోవడమేమిటి? ఒకరోజా, రెండురోజులా! సంవత్సరం కల్సితిరిగేం!  బేబీ పిన్నిగారింటిముందున్న జామచెట్లెక్కి నీకు జామకాయలు కోసిచ్చాను గుర్తులేదూ..." ఉత్సాహంగా అన్నాడు.

'అవునుబావా! బేబీ పిన్నివచ్చి నిన్ను చావగొట్టింది కూడా! నాకారోజు... బాగా గుర్తుంది... ఏమిటో బావా! కష్టం విచారం తెలియని రోజులు. బరువూ! బాధ్యతా తెలియని ఆ బాల్యంలోనే ఎప్పుడూ వుండిపోతే బావుండేదనిపిస్తోంది. నిస్పృహతో వేదాంతిలా అంది  జయలక్ష్మి.

వీరభద్రరావు కలవరపడ్డాడు ఎంచేతో బాధపడుతోందని గ్రహించాడు.

"జయా! ఇలా రామ్మా ఓసారి!" అమ్మమ్మ గొంతు విని లోనికి నడిచింది జయ.

"ఓ అరగంటయిన తర్వాత సార్? భోజనం రెడీ. అనేసి లలిల్లులా!" అని పాడుకొంటూ వెళ్ళిపోయాడు కుర్రాడు.

చాలాకాలానికి హాయిగా భోంచేసి అమ్మమ్మ చదివే సుమతీ శతకమన్ని నీతులూ, చేసే హితబోధలూ, ఉచిత సలహాలూ వింటూ అలాగే నిద్రపోయాడు వీరభద్రం. తిరిగి లేచేటప్పటికి ప్రొద్దున్న ఎనిమిదయిపోయింది.

ప్రక్కగదిలోనుంచి కుర్రాడి పాట వినిపిస్తోంది. వీరభద్రానికి బోలెడు చిరాకేసుకొచ్చింది.

"ఒరేయ్! రాజూ"

"ఏం సార్! లలలాలి...

"ఒరేయ్!'

"సార్!"

"ఇవాళ చాలా హుషారుగా వున్నట్లున్నావే?'

"ఏదో సార్!... లలిలా..."

"ఒరేయ్!"

"సార్!"

"మరోసారి "లలలా" అని మీ నోటివెంబడి వినబడితే రెణ్ణెల్లు పనిచేయించి జీతం లేకుండా డిస్‌మిస్ చేస్తా! రాస్కెల్... లలలాలి" అంట వెధవకి... నిన్నట్నుంచీ చూస్తున్నాను!"

"అలాగేసార్! లలి..." అనేసి నాలిక్కరచుకొని పరిగెత్తాడువాడు. కాఫీలయ్యాక "ఒరేయ్! దీన్ని తీసుకుపోయి ఈ హైద్రాబాద్ కొద్దిగా చూపించిరా... ఇదే మొదటిసారి రావడం మరి.."

వీరభద్రం ఎగిరి గంతేద్దామనుకొని ఇంటికప్పు మరీ కింద కుండటం చేత ఆ ఆలోచన విరమించుకొన్నాడు. జయలక్ష్మితో షైర్ కెళ్ళడమంటే యూల్ బ్రిన్నర్‌తో కాఫీ తాగినట్లు. ఎలిజబెత్ టేలర్‌తో మాట్లాడ్డానికి రెండు గంటల ఇంటర్వ్యూ దొరికినంతగా సంతోషపడిపోయాడు. ఆఫీసుకి రెండురోజులకి లీవురాసి పంపించేశాడు. పదింటికల్లా భోజనం ముగించేసి ఇద్దరూ బయల్దేరారు. సాలార్‌జంగ్ మ్యూజియం చూసి బయట పడేసరికి రెండయింది. తరువాత జూలాజికల్ పార్క్... అక్కడే టైము నలుగయి పోయింది.

"బావా! టాంక్‌బండ్.. బావుంటుంది కదా... ఎక్కడది?" అడిగింది జయలక్ష్మి.

"ఓ! ఇప్పుడక్కడికే వెళ్తున్నాం మనం!" అనేసి టాక్సీ పిలిచాడు వీరభద్రం.

టాంక్‌బండ్ దగ్గర ఓ సిమెంటు బెంచిమీద కూర్చున్నారిద్దరూ. సాయంత్రం అయిదయిపోయింది. సూర్యుడు సాయంత్రం చీకటిపడుతూండగా, ఫైళ్ళన్నీ సర్దేసుకుంటున్న ఎన్.జి.వో. లా. కాంతినంతా తగ్గించేస్తున్నాడు. దూరంగా ఓ రైలు బండి భయపడుతూ పోతోంది.

"జయా!" అన్నాడు వీరభద్రరావు. అతని హృదయంలో ఎంచేతో హుషారుగా వుంది.

"ఊఁ" అంది జయలక్ష్మి తల వంచుకొని.

"నువ్వింకా పెళ్లెందుకు చేసుకోలేదు?"

కిలకిలా నవ్విందామె.

"నవ్వుతావేం?"

ఉన్నట్టుండి మౌనం అయిపోయిందామె.

"పోనీ బావా! నీ సంగతి చెప్పు! ఎందుకు? పెళ్ళి చేసుకోనన్నావుట?

అతను సిగ్గుపడిపోయాడు. "ఏమిటో జయా! పెళ్ళాడాలనిపించలేదు..."

"నిజం చెప్పు బావా! నాకు పెళ్ళెందుకు అవలేదో. ఎందుకు అవదో... నీకు నిజంగా తెలియదా?"

వీరభద్రరావు తెల్లబోయాడు. "నాకేదో అర్థం కావడం లేదుజయా! పదేళ్ళ క్రితం మీరు మా ఇంటినుంచి వెళ్ళిపోయిన తరువాత ఇంతవరకూ నాకేమీ తెలియదు... అసలు.. సంగతేమిటి?"

రుమాలుతో కళ్లు తుడుచుకొందామె. మెల్లగా చెప్పటం మొదలెట్టింది.

"మీ యింటినుంచీ బయల్దేరి మావయ్యగారి ఇల్లు చేరుకొన్నాం అమ్మా, నేనూ. మావయ్య చాలా మంచివాడు కానీ ఏం లాభం? అత్తయ్య చైనాలాంటిది. ఎవరిమాట పడనిచ్చేది కాదు. మమ్మల్ని చాలా హీనంగా చూసేది. నేను పడేబాధలు చూసి అమ్మ కుళ్ళి కుళ్ళి ఏడిచేది. ఆ విచారంతోనే ఓ రోజు హఠాత్తుగా గుండె ఆగి... చని.. పోయింది."

ఓ నిమిషం వరకూ మాట్లాడలేకపోయింది జయలక్ష్మి.

"అంతే! బావా! అప్పటినుంచీ నేను నా భావిజీవితం గురించి విపరీతంగా ఆలోచించేదాన్ని.. అందుమూలాననే 'ఫిట్సు' రావడం జరుగుతోందని డాక్టరు చెప్పాడు."

"ఆ! ఫిట్సా!" ఆశ్చర్యపోయాడు వీరభద్రరావు.

"అవును బావా! ఎక్కువ ఆలోచించినా, మరీ విచారంగానీ, సంతోషంగానీ కలిగించే వార్తలు విన్నా పడిపోతాను. కొంతసేపటి వరకూ స్పృహ వుండదు ఈ సంగతి తెలిసి, నన్ను పెళ్ళాడ్డానికెవరూ ముందుకి రావడం లేదు. పెళ్ళాడాలనే కోరిక ఎప్పుడో అడుగంటిపోయింది. నా గురించి బాధలు పడే వాళ్ళెవ్వరూ లేరు. నా దుఃఖంలో భాగం

పంచుకొనే వారెవ్వరూ లేరను. ఈ ప్రపంచంలో నేనొక్కర్తినే వంటరి దాన్ని.... నాకెవ్వరూ లేరు... ఎవ్వరూ లేరు...” ఆమె కళ్ళ వెంబడి బొటబొటా నీరు కారింది.

వీరభద్రరావు చలించిపోయాడు. అతని మనస్సంతా ఆమె మీద సానుభూతి, జాలి, దయ, ఇంకా బోలెడు పర్యాయపదాలతో నిండిపోయింది.

“ఊరుకో జయా! .... అలా. అనొద్దు!” చాలా దీర్ఘంగా ఆలోచిస్తున్నాడతను. గడియారం ఎనిమిదిన్నర అయినట్లు సూచిస్తోంది.

“బావా! చీకటి పడింది! పోదామా?” అని కళ్ళలని చూస్తూ ప్రశ్నించింది. ఉలిక్కిపడ్డాడుతను. “ఏమిటి...”

నవ్వింది జయలక్ష్మి! ఏమిటంతగా ఆలోచిస్తున్నావ్! నా గురించేనా?... భలేవాడివేలే... ఇంకామర్చిపోలేదన్నమాట” లేచి నుంచుంటూ అందామె. ఇద్దరూ ప్రక్కప్రక్కనే నడుస్తున్నారు.

అతను ఆలోచిస్తున్నాడు “జయకింత అన్యాయం ఎందుకు జరిగింది. ఆమె విషయంలో భగవంతుడు చాలా “క్రూయల్‌గా” ప్రవర్తించాడు...”

హఠాత్తుగా జయలక్ష్మి నుంచుండి పోయింది తూలి అతని చేయి గట్టిగా పట్టుకు నుంచుండిపోయింది. కళ్ళు మూతలు పడుతున్నాయి.

‘‘జయా! ఏమిటి?.. ఏమయింది?’’ ఆమె భుజాలు పట్టుకొని కుదుపుతూ అడిగాడతను. కుప్పలా కూలిపోతున్న ఆమెని రెండు చేతుల్తోను లేవనెత్తి ప్రక్కనున్న మరో సిమెంట్ బెంచీమీదకు చేర్చాడు...అవును జయ చెప్పింది. ఫిట్స్ వచ్చి వుంటుంది. వొళ్ళో ఆమె తలవుంచి ఎప్పుడు లేస్తుందా అని కళ్ళలోకి చూస్తూ కూర్చున్నాడు. ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలు వేడిగా అతని మొఖానికి తగిలి చక్కిలిగింతలు పెడుతోన్నాయి. అతని కేమిటో మైకం కమ్ముతున్నట్లయింది. ఆమెని తన హృదయానికి హత్తుకొన్నాడు. “జయా! నువ్వు నా దానివి.. ఇకనుంచీ... నీకు... ఆ మాటకొస్తే అసలు నీకోసమే... నేనున్నాను మనిద్దరం ఇవాల్టినుంచి ఒకటి....” కొద్ది నిమిషాలకి కళ్ళు తెరిచిందామె. కొద్దిగా ఖంగారు పడిందామె.

“ఫరవాలేదు జయా! నా దగ్గరే వున్నావు!”

అతని వొళ్ళో వుండటం చూచి సిగ్గుతో లేచి నుంచుందామె. టాక్సీ రంగురంగుల మార్కెట్లు మధ్యనుంచీ వెళుతోంది సీతాఫలమండీ వేపు.

ఆ రాత్రి వీరభద్రరావుకి చాలాసేపటి వరకూ నిద్రపట్టలేదు. తను తీసుకొన్న నిర్ణయం అతనికి బోలెడు తృప్తీ, ఆనందం ఇచ్చింది. గడియారం పన్నెండు కొట్టింది. ఎదురుగ్గా కుర్చీ కదలినట్లు చప్పుడయింది.

"ఎవరది?" అన్నాడు వీరభద్రం.

"కనపట్టంలా? నీ అంతరాత్మని!"

"ఐసీ! ఏంటిలా వచ్చావ్?"

"నీతో మాట్లాడాలి."

వీరభద్రం ఓ సిగిరెట్టు వెలిగించాడు. "ఏమిటీ?"

"నువ్వా అమ్మాయిని పెళ్ళాట్టం నాకిష్టం లేదు."

"ఎందుకని?"

"నీకు తెలీనట్టు మాట్లాడగ్గరూ! ఆ అమ్మాయికి ఫిట్స్ వస్తుంటాయి. అసలు పెళ్ళేవద్దన్న వాడిని ఇలాంటి అమ్మాయినా పెళ్ళాడ్డం?"

"ఏడ్చావుగాని... ఇహపో!"

"నే జెప్పేది..."

"నోర్మూసుకొని బయటకుఫో! గెటవుట్!"

ఆ తరువాత వీరభద్రం మాంచి నిద్రలో మునిగిపోయాడు.

ఓ పదేన్రోజుల తర్వాత తమ ఇంటిముందు ఓ పెద్ద పందిట్లో జయలక్ష్మి మెళ్ళో వీరభద్రరావు మంగళసూత్ర ముడివేసిన కొన్నిగంటల తరువాత, అధికార, మరియు లాబీ వర్గాల ద్వారా తెలిసిన రెండునిజాలు విని అదేరోజు జయలక్ష్మిని నిలేసి "నిజమా?" అనడిగాడు.

జయలక్ష్మి ఇలా నవ్వేసి "పో బావా!" అవన్నీ ఇప్పుడెందుకు? అంటూ అతని మీద వాలిపోయి అతన్ని మరోమాట అడక్కుండా చేసింది.

మర్నాడంతే అదే ఆలోచిస్తున్నాడు వీరభద్రరావు.

"దేవతలాంటి అత్తయ్యని, "చైనాలాంటి రాక్షసినీ" తన కసలు ఏ జబ్బూ లేంది ఫిట్స్ వస్తయ్యనీ, పైగా ప్రత్యక్షంగా చూబించీ?.... ఇదంతా ఎందుకు చేసింది జయలక్ష్మి.

ఇప్పటికింకా ఆలోచిస్తూనే వున్నాడు. ఎప్పుడయినా జయలక్ష్మి నడిగితే అప్పటిలానే నవ్వేస్తోంది "పో" బావా! అంటూ.